క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కంబాలచెరువు: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం జనరల్ విభాగంలో ప్రథమ సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలను 3,187 మందికి రాయాల్సి ఉండగా 3 వేల మంది హాజరయ్యారు. వొకేషనల్ కు సంబంధించి 222 మందికి 202 మంది రాశారు. మధ్యాహ్నం జరిగిన జనరల్ విభాగంలో తెలుగు, సంస్కృతం, హిందీ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 298 మందికి 250 మంది హాజరయ్యారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం పరీక్షను 119 మందికి 105 మంది రాశారు. రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్లు, నలుగురు సిట్టింగ్ స్క్వాడ్లు, కస్టోడియన్లు, డీఈసీ, డీఐఈవో, ఆర్ఐవో తదితరులు 18 పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఇంటర్మీడియట్ జిల్లా ఆర్ఐవో ఎన్ఎస్వీఎల్ నరసింహం తెలిపారు.

మాజీ ఎంపీ భరత్‌పై ఫిర్యాదు

రాజమహేంద్రవరం: మాజీ ఎంపీ మార్గాని భరత్‌పై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నాయకులు, టీడీపీ లీగల్ సెల్ కమిటీ సభ్యులు సోమవారం జిల్లా ఏఎస్పీ ఏవీ సుబ్బరాజుకు ఫిర్యాదు చేశారు. టీడీపీ పార్లమెంటు కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచపల్లి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ తదితరులు ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు లేఖను అందజేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై, టీడీపీపై భరత్ రామ్ ఆరోపణలు చేస్తున్నారన్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన పాముల వెంకన్నను కొట్టిన పాముల స్వామిపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పాముల స్వామి కొంత నగదు వెంకన్నకు ఇచ్చాడు. అయితే నీకు డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదని వెంకన్న అనడంతో ఆగ్రహం చెందిన స్వామి పక్కనే కూల్‌డ్రింక్ సీసా తో తలపై కొట్టాడు. దీనితో వెంకన్న తలకు తీవ్ర గాయమైంది. అతడు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు.

వైభవంగా గోవృషభ కల్యాణం



గోవృషభ కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధంలో సోమవారం గోవృషభ కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ముత్యం వెంకట హరే రామకృష్ణ (శ్రీను), రఘుదుర్గ దంపతులతో వేదపండితుల ఆధ్వర్యంలో వృషభరాజును నారాయణ స్వరూపుడిగా, గోవును లక్ష్మీ స్వరూపిణిగా భావించి ఈ కార్యక్రమం జరిపారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించి, పూర్ణాహుతి సమర్పించారు. అలాగే కామ్యవృషోత్సర్జనం (అచ్చు వేసిన ఆంబోతును వదలడం) కూడా చేశారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

సీతానగరం: రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీఎం జిలానీ అన్నారు. సీతానగరం స్త్రీశక్తి భవనంలో సమాఖ్య అధ్యక్షురాలు కందికట్ల అరుణ కుమారి అధ్యక్షతన సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వార్షిక రుణ జీవనోపాదుల ప్రణాళికలను మైక్రో క్రెడిట్ ప్లాన్ (ఎంసీపీ)గా మార్చడం, మొబైల్ బుక్ కీపింగ్ (ఎంబీకే 2.0) కోసం మండలంలోని 59 గ్రామ సంఘాల సహాయకులకు శిక్షణ ఇచ్చారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బిక్కవోలు: మండలంలోని ఇరువర్గాల ఘర్షణ ఘటనపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రరావు తెలిపారు. ఇలపల్లి గ్రామంలోని సోమవారం ఉపాధి హామీ పనుల వద్ద రెండు వర్గాల వారు ఘర్షణ పడినట్టు తెలిపారు. ఇరువర్గాల్లో పలువురు గాయపడ్డారని, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈస్సాకోటి వెంకటరమణ ఫిర్యాదుపై పొలినాటి సరోజితోపాటు ఆమె బంధువులు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. పోలినాటి సరోజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈస్సాకోటి వెంకటరమణతో పాటు మరో నలుగురుపై కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా కట్లమ్మ తీర్థం

బిక్కవోలు: పందలపాకలో కొలువైన కట్లమ్మ అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గొర్రిపోటి వెంకటరమణ, అరుణ దంపతులు, బూరెలు, పానకం, బండారు అప్పారావు, సత్యవతి దంపతులు పులిహోర భక్తులకు పంపిణీ చేశారు. ఆడపడుచుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నలువైపులా నిఘా..

- సీసీ కెమెరాలతో పహారా
- కడియం మండలంలో ఏర్పాటు
- సహకరిస్తున్న దాతలు



ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావుకు సీసీ కెమెరాలను అందజేస్తున్న దాతలు (ఫైల్)

కడియం: నియోజకవర్గంలోని కడియం మండల సరిహద్దులో నాలుగు వైపులా క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల (సీసీ కెమెరాలు) పహారా ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాతల సహకారంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వేమగిరి జంక్షన్, కడియపులంక పూల మార్కెట్, దుళ్ల గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయ్యింది. పొట్టిలంక, జేగురుపాడుతో పాటు ఇతర గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. కడియపులంక ఆంజనేయస్వామివారి ఆలయ కమిటీతో పాటు, మండలంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కూడా వీటిని ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

నేరాల దర్యాప్తులో కీలకం

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నేరాలు జరక్కుండా ఉండడంతో పాటు, ఒక వేళ నేరం జరిగితే దర్యాప్తులో సైతం ఇవి కీలకమన్నది ఇప్పటికే తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో పోలీసుశాఖ కీలక ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సమాయత్తమైంది. ఇందుకోసం అవసరమైతే దాతల సహకారం కూడా తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అంతే కాకుండా తమను కలిసేందుకు వచ్చే నాయకులను కూడా ఈ విధంగా ప్రోత్సహించారు.

పది చోట్ల ఏర్పాటు

కడియం మండలంలో ప్రస్తుతం 10 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు తగిన పరికరాలను అందుబాటులోకి వచ్చాయి. వీటిలో అత్యాధునిక సోలార్ ఎక్విప్డ్ సీసీ కెమెరాలు కూడా ఉండడం విశేషం. రాత్రి పూట కూడా ఫొటోలు, వీడియోలు స్పష్టంగా కన్పించే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ కెమెరాల ద్వారా 24 గంటలూ పోలీసు సిబ్బంది మొబైల్స్‌కు ఫొటోలు, వీడియోలు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. దీంతో 24 గంటలు సిబ్బంది అప్రమత్తంగా ఉండడంతో పాటు, ఏదైనా నేరం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే అలర్ట్ అయ్యేందుకు కూడా అవకాశం కలుగుతోంది. తద్వారా నేరస్తులు పట్టుకోవడం కూడా సులభమవుతుందని సిబ్బంది చెబుతున్నారు.

దాతల సహకారం

కడియం మండలంలో ఇప్పటి వరకు పది చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. మరో ఆరు చోట్ల కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మండలంలోని దాతల సహకారంతో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. అత్యంత కీలకమైన ప్రదేశాల్లో వీటిని పెట్టడం ద్వారా నేరాలు అరికట్టవచ్చు. అలాగే కేసుల దర్యాప్తులోనూ కీలకంగా మారతాయి.

– ఏ.వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్, కడియం పోలీస్‌స్టేషన్

వీర జవాన్ మురళీ నాయక్‌కు నివాళి



మురళీ నాయక్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న సీహెచ్ఓలు

రాజమహేంద్రవరం రూరల్: పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో అశువులు బాసిన వీర జవాన్ మురళీ నాయక్‌కు సీహెచ్ఓలు నివాళులర్పించారు. ఆయన చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో సీహెచ్ఓలు చేస్తున్న సమ్మె సోమవారానికి 15వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.మమత, సీహెచ్ఓలు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని తాడితోట జంక్షన్, ఆవ రోడ్డులో జరుగుతున్న పూడిక తీత పనులను నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం పరిశీలించారు. పనులను యుద్ధప్రాతిపదికను చేయాలని, తీసిన పూడికను ఎప్పటికప్పుడు తరలించాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన డ్రెయిన్లలో మురుగునీరు, వ్యర్థాలు నిల్వ ఉండకుండా ఉంటేనే వర్షపు నీరు సక్రమంగా ప్రవహిస్తుందన్నారు. ఔట్ ఫాల్ డ్రెయిన్లు శుభ్రంగా ఉండేలా ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా వ్యర్థాలను కాలువల్లో వేయకూడదని సూచించారు. శానిటేషన్ పనులు నూరుశాతం జరిగేలా ప్రజారోగ్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులలో వాహనదారులకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రతిరోజూ రాత్రి సమయంలో పారిశుద్ధ్య పనులును నిర్వహించాలన్నారు. అనంతరం క్వారీ మార్కెట్ లోని వెహికల్ యార్డును సందర్శించారు. ఆయన వెంట ఇంజినీరింగ్ ఈఈ రీటా, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ భరత్ పుట్టినరోజు వేడుకలు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్గాని నాగేశ్వరరావు, చందన నాగేశ్వర్, రావిపాటి రామచంద్రరావు



గౌతమీ జీవకారుణ్య సంఘంలో వృద్ధులకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం
- పలు వార్డుల్లో సేవా కార్యక్రమాలు

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ పుట్టినరోజు వేడుకలను సోమవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్‌లోని పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని బీసీ జేఏసీ రాష్ట్ర నాయకుడు మార్గాని నాగేశ్వరరావు, రావిపాటి రామచంద్రరావు, చందన నాగేశ్వర్ ప్రారంభించారు. నగరంలోని అన్ని డివిజన్లలో వైఎస్సార్ సీపీ శ్రేణులు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. మహిళలకు చీరలు, పేదలకు వస్త్రాల పంపిణీ, చలివేంద్రాల్లో మజ్జిగ వితరణ, స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో అన్నదానం జరిపాయి. ఈ సందర్భంగా మార్గాని నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో భరత్ రామ్ పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టారన్నారు. కంబాల చెరువు పార్కు మొదలుకుని నగరంలోని పలు పార్కుల అభివృద్ధి, హ్యాపీ స్ట్రీట్, ఈట్ స్ట్రీట్, మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను భరత్ రామ్ చేపట్టారని తెలిపారు. మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని అనుకున్న సమయానికి పూర్తి చేయించిన ఘనత భరత్‌కే దక్కుతుందన్నారు. భరత్ రామ్ తన ఐదేళ్ల పదవీ కాలంలో రాజమహేంద్రవరం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం అధికారం ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కానుబోయిన సాగర్, తిరగాటి దుర్గ, వాసంశెట్టి గంగాధరరావు, దాసి వెంకట్రావు, కడియాల శ్రీను, మజ్జి అప్పారావు, జి.జాన్సన్, సంకిస భవానీప్రియ, గణేష్, రేగుల నాని తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ జీవిత చరిత్రపై సినిమా



సినిమా స్క్రిప్టును దర్శకుడు మురళీకి అందిస్తున్న నిర్మాత శ్రీనివాసరావు, రచయిత మురళీ రమేష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ జీవిత చరిత్ర ఆధారంగా సినిమా తీస్తున్నట్లు శ్రీసత్యదేవా ప్రొడక్షన్, ప్రొడక్షన్ నెం.1 నిర్మాత శ్రీనివాసరావు పూతి, దర్శకుడు మురళీ చిరువోలు, రచయిత మురళీ రమేష్ తెలిపారు. స్థానిక ఆర్యాపురం సత్యనారాయణస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం పూజలు నిర్వహించి, నూతన చిత్రనిర్మాణ సంస్థ శ్రీసత్యదేవా ప్రొడక్షన్స్, ప్రొడక్షన్ నెం.1ను ఆవిర్భావించారు. అనంతరం డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ డొక్కా సీతమ్మ చరిత్రను నేటి ప్రజలకు తెలియాలానే ఉద్దేశంతో ఈ సినిమా తీస్తున్నామన్నారు. భారీ తారాగణం, భారీ బడ్జెట్‌తో, నాలుగు నెలల్లో చిత్రీకరణ పూర్తి చేసి, దసరాకు విడుదల చేయాలని సంకల్పించామన్నారు.

గృహ నిర్మాణాలను పర్యవేక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: గృహ నిర్మాణాలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడుతో కలిసి రీసర్వే, స్వామిత్వ, హౌసింగ్, ధాన్యం సేకరణ, రెవెన్యూ అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పామ్‌పాంట్ నిర్మాణాలను వర్షాకాలం వచ్చేలోపు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలు బీమాలో పథకంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కౌలు రైతులకు అండగా నిలిచే క్రమంలో జిల్లాకు ,10,000 సీసీ ఆర్సీ కార్డులు లక్ష్యంగా ఇచ్చారన్నారు. గృహ నిర్మాణం కోసం అదనపు ఆర్థిక సాయం అందించడం జరిగిందని, డీఆర్డీఏ, మెప్మా ఆధ్వర్యంలో అదనపు రుణ సదుపాయం కల్పించారన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో క్షేత్ర స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



మహాజన సభలో పాల్గొన్న నాయకులు

ధవళేశ్వరం: వివిధ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ధవళేశ్వరంలోని మచ్చ సూర్యనారాయణ ప్రాంగణంలో జిల్లా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం మహాజన సభ జరిగింది. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ బలశాలి ఇందిరా, అరవాలమ్మ డిగ్రీ కళాశాల డైరెక్టర్ దాసరి సత్యానందం, ఆంధ్ర యూనివర్సిటీ మెంబర్ అరదాని ప్రభాకరరావు విచ్చేశారు. ఎంఎస్సీ హోమ్ జెనెటిక్స్‌లో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ సాధించిన సురేఖ అరవాలమ్మను, బీఎస్సీ ఆక్వా కల్చర్‌లో 97 శాతం మార్కులు సాధించిన ధర్మాడి సౌమ్యను, ఇంటర్‌లో 942 మార్కులు సాధించిన బి.జగతాని సాయిదుర్గను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. దాసరి సత్యానందం సభలో జగతాని సాయి దుర్గను ఉన్నత చదువులకు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు చక్క తాతారావు, అప్పారావు, గౌరవాధ్యకుడు బలసాలి సత్యాగ్రహరాజు, అధ్యకుడు పొన్నమండ వీరకుమార్, కార్యదర్శి ఎర్రా శివకుమార్, ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి నాగేశ్వరరావు, కో ఆర్డినేటర్ కామాడి సుబ్బరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మచ్చ చెల్లారావు, మల్లాడి గణేశ్వరరావు, అంగాని అప్పారావు, లంకే విష్ణువర్మ ,దాసరి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

5న విజయవాడలో ఉద్యోగుల కౌన్సిల్



సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్ వర్మ

రాజమహేంద్రవరం సిటీ/రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆశలు, ఆకాంక్షల సాధన దిశగా విజయవాడలో జూన్ 5న నిర్వహించే ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర 3వ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరి ప్రసాద్ వర్మ మాట్లాడుతూ సంఘం 365 రోజుల నిరంతర కార్యాచరణ ద్వారా ఉద్యోగులతో మమేకమై పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సుమారు 10 వేల మంది ప్రతినిధులు ఈ కౌన్సిల్‌లో పాల్గొంటారని వెల్లడించారు. సమావేశాన్ని జయప్రదం చేయడం ద్వారా ఉద్యోగులకు మేలు జరుగుతుందన్నారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జీఎస్ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగుల సమస్యలైన పీఆర్సీ కమిషన్ నియామకం, సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏల సాధన, బకాయిల చెల్లింపు వంటి వాటికి పరిష్కారం కనుగొనడానికి ఈ సమావేశం ఒక వేదిక కానుందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా సహాధ్యక్షుడు చాంబర్లీన్, జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, పి.రవికుమార్, జిల్లా సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకుడు శుభాకర్, అనపర్తి శాఖ అధ్యక్షుడు డాక్టర్ రామగురు రెడ్డి, జిల్లా నాయకులు ఎ.శ్రీనివాసరావు, జీఎస్ రమేష్, దినేష్, ద్విభాష్యం శ్రీనివాస్, జె.రాజారావు పాల్గొన్నారు.

ఇసుకకు ఇబ్బంది లేకుండా చర్యలు



ఇసుక స్టాక్ యార్డును పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీవో కృష్ణ నాయక్

ధవళేశ్వరం: కలెక్టర్ ఆదేశాల మేరకు రానున్న వర్షాకాలం దృష్ట్యా నిర్మాణ పనులకు సంబంధించి ఇసుక ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. ప్రస్తుతం 1,08,313 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ యార్డుల్లో అందుబాటులో ఉందన్నారు. ఆయన సోమవారం ధవళేశ్వరంలోని ఇసుక స్టాక్ యార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా యార్డులలో ఇసుక అందుబాటులో ఉంచడం కోసం డివిజన్ పరిధిలో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట మండల సర్వేయర్ భువనేశ్వర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జేవీవీఎస్ ప్రసాద్, వీఆర్వోలు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

కడియం: మండలంలోని కడియపులంక ఉన్నత పాఠశాలలో 1997లో పదో చదువుకున్న విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. బుర్రిలంకలోని పీఎస్ఎం కన్వెన్షన్ హాలులో ఉత్సాహంగా ఈ కార్యక్రమం జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 80 మంది పూర్వ విద్యార్థులు తమ కుటుంబాలతో సహా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన సాయిబాబా, నాగకుమారి, సిరియాబేగం, శ్రీనివాస్, జోషిలతో పాటు, అటెండర్ రమణమ్మను కూడా వేదికపైకి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. తామంతా ఒక్కచోట చేరేందుకు కృషి చేసిన స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ కిశోర్ బి.రెడ్డి సేవలు అభినందనీయం



డాక్టర్ కిశోర్ బి.రెడ్డిని అభినందిస్తున్న పీఎంపీలు

కంబాలచెరువు: కండరాలు, ఎముకలు, కీళ్లకు సంబంధించిన క్యాన్సర్ సేవలను రాజమహేంద్రవరం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన మస్క్యులోస్కెలేటల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కిశోర్ బి.రెడ్డి అభినందనీయులని కమ్యూనిటీ పారామెడిక్స్-ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సదస్సులో హైదరాబాద్ అమర్ క్యాన్సర్ సెంటర్‌కు చెందిన మస్క్యులోస్కెలెటల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కిశోర్ బి.రెడ్డిని ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ ఎముకలకు కండరాలకు కీళ్లకు సంబంధించిన క్యాన్సర్ సేవలు గ్రామాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని పీఎంపీలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, రాష్ట్ర గౌరవ సలహాదారులు కోన చిన్నారావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, రాజమండ్రి అధ్యక్షుడు రహమాన్ ఖాన్ పాల్గొన్నారు.

గ్రీష్మతాపం.. రోడ్లు నిర్మానుష్యం



రాజానగరంలో నిర్మానుష్యంగా జాతీయ రహదారి

రాజానగరం: వేసవి ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఆకాశంలో అడపాదడపా కారుమబ్బులు వేస్తున్నా, వాటి ప్రభావం పెద్దగా ఉండడం లేదు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నెలాఖరు నాటికి నైరుతి రుతుపవనాలు వస్తాయనే చల్లటి కబురుతో వాటి రాక కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత టాపులేపేలా ఉంటున్న పరిస్థితులలో జనం బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. 38 డిగ్రీల పైబడుతున్న ఉష్ణోగ్రతలు చినుకులు పడితేగాని చల్లబడే పరిస్థితులు కానరావడం లేదు. ఈ నెల మొదటి వారంలో భారీగా వర్షం కురిసినా ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గలేదు. జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్న సమయంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఆర్టీసీ బస్సులు మినహా లారీలు, ఆటోలు కూడా పెద్దగా తిరగని పరిస్థితులలో రాజానగరం, దివాన్ చెరువు, లాలాచెరువు కూడళ్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.

వడగాల్పులకు బలి కావొద్దు

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాల్పులు తగిలే అవకాశాలు కూడా అధికంగానే ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల సమయంలో బయట తిరగవద్దంటున్నారు. చెమట కారణంగా శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా తరచూ నీరు, గ్లూకోజ్ వాటర్, బార్లీ నీరు తాగుతుండాలని సూచించారు. అలాగే నీరసమనిపిస్తే ఓఆర్ఎస్ తీసుకోవడం మంచిదన్నారు.

కూల్‌డ్రింక్‌లకు డిమాండ్

వేసవి ఎండల తీవ్రతకు కొబ్బరి బొండాలతో పాటు జ్యూస్, కూల్‌డ్రింక్‌లకు డిమాండ్ ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాలలో సైతం జ్యూసులు, కూల్‌డ్రింక్‌ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నగర వాతావరణం ఉన్న ప్రాంతాల కూడళ్లలో కొబ్బరి బొండాలు విక్రయాలు మంచి లాభాలను అందిస్తున్నాయి.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతీ అర్జీని తక్షణమే పరిష్కరించాలని అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 29 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సోమవారం వచ్చిన అర్జీలు శనివారానికి క్లోజ్ అయ్యేలా ఆయా విభాగాల హెచ్‌ఓడీలు చొరవ చూపాలన్నారు. కొన్ని సందర్భాలలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలపై పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. అర్జీదారునికి కచ్చితంగా సరైన సమాధానం అందాలని సూచించారు. అలాగే ఫిర్యాదుదారు ఇచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఎన్ని రోజుల్లో పరిష్కరించేది రశీదు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం పెండింగ్ గ్రీవెన్స్‌పై ఆరా తీశారు. గతంలో వచ్చిన కొన్ని అర్జీలు ఇప్పటికీ క్లియర్ కాకపోవడంపై టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆయా సచివాలయ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు.